క్లుప్తంగా

చింతలపూడి ఎక్సైజ్ సీఐగా అశోక్



పి అశోక్, ఎక్సైజ్ సీఐ

చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరువూరు నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సర్కిల్‌లో మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 125 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అక్రమ సారాపై కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



బయ్యన్నగూడెంలో వృద్ధాప్య సమస్యలపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు అవగాహన సమావేశం, వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహం, మూత్రం పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు వృద్ధులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ రవితేజ, ఏఎన్‌ఎంలు జి.అనసూయ, ఎం.నాగమణి, హెల్త్ అసిస్టెంట్ కె.మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్తీకానికి ముస్తాబవుతున్న శ్రీవారి పుష్కరిణి



డీఈ సూర్యనారాయణ పర్యవేక్షణలో పుష్కరిణిలోని చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: కార్తీక మాసం దగ్గర పడటంతో దేవస్థానం అధికారులు శ్రీవారి పుష్కరిణి (నరసింహ సాగరం)ని శుభ్రం చేసే పనులు సోమవారం ప్రారంభించారు. ప్రతి ఏటా కార్తీక మాస పర్వదినాల్లో భక్తులు ఈ పుష్కరిణిలో పుణ్య స్నానాలను ఆచరిస్తారు. అలాగే ఆ మాసంలో వచ్చే క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం నాడు శ్రీవారి తెప్పోత్సవ వేడుకను వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో వచ్చేనెల 13న స్వామివారి తెప్పోత్సవ వేడుకను పుష్కరిణిలో కన్నుల పండువగా జరుపనున్నారు. వీటిని పురస్కరించుకుని దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ పర్యవేక్షణలో పుష్కరిణిని ముస్తాబు చేసే పనులు తొలిరోజు చురుగ్గా సాగాయి. పుష్కరిణి గట్లపై ఉన్న పొదలను, పుష్కరిణిలోని చెత్తా చెదారాన్ని, తూడును సిబ్బంది తొలగిస్తున్నారు.

వైభవంగా తెప్పోత్సవం



గరగ నృత్యాలతో తెప్పోత్సవం

పోలవరం రూరల్: గంగమ్మ తల్లి తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రజలను చల్లగా చూడాలని ప్రార్థిస్తూ పోలవరం పంచాయతీ పరిధిలోని పాత పోలవరం ప్రాంత ప్రజలు ఏటా గోదావరి మాతకు తెప్పోత్సవం నిర్వహించి పూజలు నిర్వహిస్తారు. సోమవారం కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి తెప్పోత్సవం సందర్భంగా గ్రామంలో గరగ నృత్యాలు, వాయిద్యాలతో భారీగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లికి పసుపు కుంకుమ సారె సమర్పించి పూజలు చేశారు.

దసరా మండపం ముస్తాబు



మండపానికి రంగులు వేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని చెరువు వీధిలో ఉన్న దసరా మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. విజయదశమి పండుగనాడు చినవెంకన్నకు ఈ మండపంలో శమీ పూజను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. దీన్ని పురస్కరించుకుని మండపానికి రంగులు వేస్తున్నారు. అలాగే పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. మండపంలో ఈనెల 12న రాత్రి శ్రీవారికి నిర్వహించే శమీ పూజలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొననున్నారు.

మెట్టలో ముమ్మరంగా మిర్చి సాగు

- గతేడాది కంటే ఈసారి అధికంగా సాగు చేస్తున్న రైతులు
- గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వంపైనే ఆశలు



లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో మిర్చితోటలు వేసిన దృశ్యం



కొణిజర్లలో మిర్చినారు

లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో ముమ్మరంగా మిర్చితోటల సాగు చేపట్టారు. మిర్చి సాగులో జిల్లాలోనే లింగపాలెం మండలం ప్రసిద్ధి చెందింది. గతేడాది ఎండుమిర్చికి గిట్టుబాటు ధర లభించడంతో ఈ ఏడాది మిర్చిసాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో అధిక మొత్తంలో మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి ఎక్కువ పెట్టుబడి పెట్టి నారుమళ్లు వేస్తున్నారు. ఈ మండలంలో రైతులే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి రైతులు ఇక్కడకు వచ్చి మిర్చి నారును కొనుగోలు చేస్తుంటారు. ఎకరం మిర్చి సాగు వేయటానికి 9 వేల నుంచి 10 వేల వరకు మిర్చి మొక్కలు అవసరం. ఒక్కొక్క మొక్కను రూ.1.25 నుంచి రూ.1.50 రైతులు మిర్చినారును కొనుగోలు చేస్తున్నారు. మండలంలో గత ఏడాది సుమారు 1300 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. అయితే ఈఏడాది 2,100 ఎకరాల వరకు రైతులు మిర్చిసాగు చేయనున్నట్లు అధికారుల అంచనా. దీనిలో ఒక్క ధర్మాజీగూడెం ఏరియాలోనే సుమారు 216 ఎకరాల్లో ఈ మిర్చి పంటను రైతులు సాగుచేస్తారు. ఇక్కడ పండించిన మిర్చి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తారు. ఎకరం మిర్చి పంటను సాగుచేయాలంటే రూ.లక్ష నుంచి రూ.లక్షా యాభైవేలు వరకు పెట్టుబడులు అవుతాయని రైతులు చెబుతున్నారు. ఎస్ఎస్, డబల్ టు, తేజ, తులసి, శ్రీజంట, సస్‌గ్రో, కల్యాణి రకాల మిర్చి విత్తనాలను నారుమడులు పోశారు.

ఎగుమతులే ఎక్కువ

ఇక్కడ పండించిన పచ్చిమిర్చి కాయలను బొంబాయి, ఢిల్లీ, పూనా వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన కమీషన్‌దారులకు వ్యాపారులు ఎగుమతులు చేస్తుంటారు. పొలంలో మిర్చి మొక్క నాటిన 90 రోజులకు కాపునకు వస్తుంది. అప్పుడు కొందరు రైతులు పచ్చికాయను కోసి అమ్మకాలుచేయగా మరికొందరు రైతులు పండుకు ఆపి ఎండిమిర్చికి ఉంచుతారు. పచ్చి మిర్చి 60 కేజీల బస్తా గతంలో రూ.1500 నుంచి రూ.2000 వరకు ధర పలకనుంది. అదే ఇతర రాష్ట్రాలలో మార్కెట్ లేకపోతే ధర తగ్గుతుంది. ఎకరం పొలంలో మిర్చి పంట వేస్తే 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు ఎండి మిర్చి దిగుబడి వస్తుంది. నాణ్యతను బట్టి క్వింటా రూ 15 నుంచి 18 వేల లోపు ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం క్వింటాకు రూ 12 వేలు నుంచి రూ 15 వేలు వరకు ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. కనీసం రూ.18 వేలు ధర పలకపోతే తమకు గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

లింగపాలెం మండలంలో రైతులకు అందజేసే పలురకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి దుకాణాల తనిఖీ విషయంలో వ్యవసాయాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో పలు దుకాణల్లో అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, మార్కెట్ కలిసివస్తే మిర్చి పంట వేసినందుకు ఫలితం ఉంటుందని రైతులు పేర్కొన్నారు. మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



మిర్చి పంటను సాగుచేసేందుకు ఎంతో కష్టపడి పెద్ద మొత్తంలో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా, పైరుకు పలు తెగుళ్లసోకి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వర్షాలకు నారుమళ్లు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల పరిస్థితులను ప్రభుత్వం అర్థం చేసుకుని గిట్టుబాటు ధర కల్పించాలి.

– పి మాధవ, రైతు, ధర్మాజీగూడెం

వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి తరలిరావాలి

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 9న ఏలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి జంగారెడ్డిగూడెం మండలం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 గంటలకు కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు

కొయ్యలగూడెం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎ.నయోమీరాణిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆ శాఖ పీడీ కేవీఎఎల్ పద్మావతికి ఫిర్యాదు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సుజాత, పి.భారతి, కొయ్యలగూడెం మండల ఐసీడీఎస్ నాయకులు సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు అందించారు. ప్రతినెలా కొయ్యలగూడెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడి సెంటర్ నుంచి మామూళ్లు ఇవ్వాల్సిందిగా భయపెడుతున్నారని, స్పందించని వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. పోషకాహార వారోత్సవాలు, ఇతర ప్రభుత్వ అధికారిక ఈవెంట్లలో పాల్గొంటున్న సమయంలో తమ వద్ద నుంచి వేల రూపాయలు సూపర్‌వైజర్ వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్ట్

చింతలపూడి: జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు రవిచంద్ర ఆదేశాల ప్రకారం సీఐ రవీంద్ర ఆధ్వర్యంలో చింతంపల్లి డంపింగ్ యార్డు సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. 6 గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.86 వేల నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

శ్రీమహాచండీ.. అనుగ్రహించమ్మా



ద్వారకాతిరుమల: శ్రీ మహాచండీ దేవి అలంకరణలో కుంకుళ్లమ్మ



పోలవరం రూరల్: మహాచండీగా పూజలందుకున్న కనకదుర్గమ్మ



లింగపాలెం: ధర్మాజీగూడెంలో అమ్మవారి దర్శనం



కొయ్యలగూడెం: లలితా దేవిగా శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ



జంగారెడ్డిగూడెం: మహాచండీదేవి అలంకరణలో విజయదుర్గమ్మ తల్లి



జంగారెడ్డిగూడెం: కాత్యాయనిదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో రాజరాజేశ్వరీ అమ్మవారు

దుర్గామాత నవరూపాల్లో ఒకటైన శ్రీ మహాచండీ అలంకారణలో సోమవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహాచండీని ప్రార్థిస్తే సర్వ దేవతలను ప్రార్థించినట్లేనని భక్తుల విశ్వాసం. ద్వారకాతిరుమల క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ, జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ తల్లి, విజయదుర్గమ్మ మహాచండీదేవిగా పూజలందుకుంది. గురవాయిగూడెం రామలింగేశ్వరస్వామి వారి క్షేత్రంలో కొలువై ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారు మహాచండీ దేవిగా, ధర్మాజీగూడెంలోని కనకదుర్గమ్మ, శివాలయం అలయాల్లో అమ్మవారు కాళికాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొయ్యలగూడెం మండలం రాజవరంలో భవానీలు పెద్ద సంఖ్యలో సామూహిక పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్

గిరిజనుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం మండలం మర్రిగూడెం గిరిజనులు సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మర్రిగూడెంలో సుమారు 38 ఎకరాల భూమి గిరిజనులు సాగు చేస్తున్నారన్నారు. బుట్టాయగూడెం గ్రామానికి చెందిన బాషా శ్యామ్ అక్రమంగా సదరు భూములను స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో గిరిజన మహిళలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. తప్పుడు కేసులు పెడుతున్న బాషా రంపాలరాజు, బాషా శ్యామ్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మర్రిగూడెంలో ఉన్న ఎల్‌టీఆర్ భూములను గిరిజనులకు చెందేలా, సదరు భూములను గయాలి అని ఇచ్చిన ఆర్డర్ కాపీని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు సాలి రాజశేఖర్, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి సముద్రాల సుందర్రావు, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు కాశీ బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బత్తుల బాబురావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడులు ఆపాలంటూ ర్యాలీ



బుట్టాయగూడెంలో వామపక్షాల పార్టీలు ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఇజ్రాయెల్ చేస్తున్న ఆటవిక దాడులను వెంటనే ఆపాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం బుట్టాయగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల పార్టీ నాయకులు ధర్మల సురేష్, తెల్లం రామకృష్ణ, కారం రాఘవ, అందుగుల ఫ్రాన్సిస్, తగరం బాబూరావు, నాగమణి మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయెల్ దేశం యుద్ధం మొదలుపెట్టి ఏడాది కావొస్తుందని, దీనిలో భాగంగా అక్టోబర్ 7వ తేదీన పాలస్తీనా సంఘీభావ దినంగా పాటించాలని వామపక్షాల పార్టీలు పిలుపునిచ్చాయని అన్నారు. దీనిలో భాగంగానే ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు.

జంగారెడ్డిగూడెం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం తక్షణం ఆపివేయాలని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పాలస్తీనాకు మద్దతు ఇవ్వాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ డిమాండ్‌చేశారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ నూడెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. భారత ప్రభుత్వం సైతం పాలస్తీనాకు మద్దతుగా నిలవాలని, ఇజ్రాయెల్ వైఖరిని ఖండించాలని డిమాండ్ చేశారు.

ఊటనీరే ఆ గ్రామానికి దిక్కు

- అల్లూరినగర్‌లో తాగునీటి కష్టాలు
- మూడు నెలలుగా పనిచేయని తాగునీటి పథకం
- పట్టించుకోని అధికారులు



అల్లూరినగర్‌లో ఊటనీటిని తోడుతున్న గిరిజనులు



ఊట నీరు అడుగంటిపోవడంతో జేసీబీతో గొయ్యితీస్తున్న దృశ్యం

వేలేరుపాడు: గిరిజనులు తాగునీటికి అల్లాడిపోతున్నారు. రక్షిత తాగునీటి పథకాలు పనిచేయక ఊట నీటిపైనే ఆధారపడాల్సిన దుస్థితి. ఈ నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. వేలేరుపాడు మండలంలోని అల్లూరినగర్ గ్రామాన్ని గత మూడు నెలలుగా తాగు నీటి సమస్య పట్టిపీడిస్తోంది. ఈ గ్రామంలో మొత్తం 105 గిరిజన కుటుంబాలున్నాయి. జులై నెలలో పెద్దవాగు ప్రాజెక్ట్ ఆనకట్ట తెగిపోవడంతో ఈ గ్రామంలో ఇండ్లన్నీ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి, సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో గిరిజనులు మిగిలారు. గ్రామంలో తాగునీటి పథకానికి సంబంధించిన ఫిల్టర్ పాయింట్, విద్యుత్ మోటర్ పెద్దవాగు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఈ గ్రామంలో మంచినీటి పథకం మూలనపడింది. గత మూడు నెలలుగా ఈ మంచినీటి పథకం మూలనపడినా పట్టించుకునే దిక్కు లేదు. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మూడు నెలలుగా గ్రామానికి చేరువలో ఊట నీటిని తాగునీటిగా వినియోగిస్తున్నారు. వారం రోజుల క్రితం ఈ ఊట నీరు కూడా అడుగంటిపోయింది. దీంతో గిరిజనులు జేసీబీ ద్వారా సోమవారం పెద్దగొయ్యి తీశారు. ఆ గోతిలో ఊట నీటినే ప్రస్తుతం తాగుతున్నారు. ఈ కలుషిత నీటి వల్ల రోగాల బారిన పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీరు అందించాలని గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

గిరిజనులను ప్రభుత్వం గాలికి వదిలేసింది

కుక్కునూరు: కుక్కునూరు మండల ఏజెన్సీలోని గిరిజనులను ప్రభుత్వం గాలికి వదిలివేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆరోపించారు. బండారిగూడెంలో సోమవారం శాఖా కార్యదర్శి మడకం ఇరమయ్య అధ్యక్షతన శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీటి, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రధానంగా బండారిగూడెం గుంపులో రోడ్డు మార్గం లేక గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అక్కడ పాకలో పాఠశాల నిర్వహిస్తున్నారని, వారికి కనీసం రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, కార్యదర్శి మన్నవ యామిని, కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా సమితి సభ్యులు కురాకుల బాబూరావు, మడకం నవీన్, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన వైస్ చైర్మన్



కమిషనర్ కేవీ రమణను సత్కరిస్తున్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్‌లు, నాయకులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేవీ రమణను మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందించి, దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కౌన్సిలర్ పీపీఎన్ చంద్రరావు, ఎల్ వెంకటేశ్వరరావు, దొంతు మాధవ, మీడియా కోఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో కరెంట్ కష్టాలు

కుక్కునూరు: ఏజెన్సీ వాసులను కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. చిన్న గాలివానకే గంటల కొలది కరెంటు తీసేస్తుండడంతో పిల్లాపాపలతో దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఏజెన్సీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల క్రితం రాజీవ్ నగర్ ప్రాంతంలో కరెంటు స్తంభం విరిగిన కారణంగా ఒకరోజు రాత్రి మొత్తం కరెంటు లేక ఇబ్రహీంపేట వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మండలంలో కరెంట్ కష్టాలు పెరిగాయని మండలవాసులు విమర్శిస్తున్నారు. కరెంటు పోయిన సమయంలో సిబ్బందికి ఫోన్ చేస్తే కనీసం స్పందించే పరిస్థితి లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మెగా జాబ్‌మేళాకు మహిళల హాజరు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లిలో ఉద్యోగ కార్యాలయం, సెట్వెల్ సంయుక్త ఆధ్వర్యంలో లిక్సిల్ ఇండియా శానిటరీవేర్ కోసం ప్రత్యేక మహిళల ఉద్యోగ మేళాను సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరయ్యారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి 240 మంది మహిళలు హాజరయ్యారు. ఈ డ్రైవ్‌లో ఎంపికైన అభ్యర్థులు రెండో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉందని జిల్లా ఉద్యోగాధికారి సి.మధుభూషణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్, సెట్వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర్, ఏసీఎస్ జిల్లా సమన్వయకర్త జి.ప్రవీణ్ కృష్ణ, లిక్సిల్ కంపెనీ ప్లాంట్ లీడర్, ఆపరేషన్స్ లీడర్ పి.బాలకుమార్, లీడర్ హెచ్‌ఆర్-అడ్మిన్ రామ్మోహన్, కె.లోకేశ్, హెచ్‌ఆర్ లీడర్ పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీవో కె.అద్దయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. విద్యుత్ శాఖ షిఫ్ట్ ఆపరేటర్ రూ. 20వేలు అక్రమంగా తన వద్ద నుంచి తీసుకున్నారని, చర్యలు తీసుకోవాలని అంకాలగూడెంకు చెందిన పి.లక్ష్మణరావు ఫిర్యాదు చేశారు. విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని జంగారెడ్డిగూడెంకు చెందిన చల్లగాని వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఏడువాడలపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నల్లమోను వెంకట లక్ష్మయ్య మరికొందరు, టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెంలో ఆక్రమించి షాపులను నిర్మిస్తున్నారని, వాటిని నిలుపుదల చేయాలని డి.విజయకుమార్ వినతిపత్రం అందజేశారు. అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు.